గ్రామ పరిపాలనా వ్యవస్థలో కరణం, మునసబుల పాత్ర కీలకంగా ఉండే రోజుల్లో గునుపూడి కరణం శక్తి సామర్థ్యాలని మనసులో మెచ్చుకుంటూనే, బాహాటంగా వ్యతిరేకించే మునసబు ద్వంద మనస్తత్వం మానవ నైజానికి ప్రతీక!

# చదరంగం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామాధికార్ల వ్యవస్థని హఠాత్తుగా రద్దుచేసింది. దాంతో గునుపూడి కరణం, మున్సబులిద్దరికీ కాలూ చెయ్యీ విరిచేసినట్టయింది. ముమ్మరంగా చేతినిండా పని ఉండి లెక్కలేనన్ని వ్యవహారాలు చేసేవాళ్ళకి ఒక్కసారిగా పనిలేకపోవడంతో పిచ్చెక్కినట్టుగా ఉంటోంది. రోజూ రెండు పూటలా భోంచేసి ఆ మర్రిచెట్టు కింద బల్లరాతి మీద విర్వ్యాపారంగా కూచోడం వాళ్లకి సుతారమూ ఇష్టం లేదు. కాని ఆ నిస్సహాయస్థితిలో వాళ్ళంతకంటే చేయగలిగిందేమీ లేదుకూడా.

రోజూలాగే ఆవేళ కూడా మున్సబు మధ్యాహ్నం భోంచేసి చుట్ట కాల్చుకుంటూ వచ్చి, అప్పటికే అక్కడ కూర్చున్న కరణంతో "ఏం పంతులూ, ఓ ఎత్తు ఏద్దారేటి?" అని అన్నాడు.

"ఆఁ ! రా! కూచో. అంతకంటే మనకిప్పుడు మునిగిపోయే పనేముంది గనక?" అంటూ చదరంగం బల్లని ముందుకితోసి "మస్తా? నిర్మస్తా?" అని అడిగాడు కరణం.

"నాకైతే నిర్మస్తే ఇష్టమయ్యా. నువ్వేమనుకున్నాసరే గాని" అన్నాడు మున్సబు.

"ఇందులో అనుకోడాని కేముందిలే! రూల్సు నీ కెంతో నాకూ అంతే కదా!" జవాబిస్తూ పావుల్ని సర్దాడు కరణం.

"ఊఁ అలా తూర్పుకెళ్ళి తిరిగి కూకో. మల్లా సుట్టపొగ పళ్లేదంటావు" అని దూరంగా వెళ్ళి తుపుక్కున ఉమ్మి తిరిగొచ్చి కూచుని రాజు ముందు బంటును ముందుకి తోశాడు మున్సబు.

మన్సబువేసే ఎత్తుల్ని జాగ్రత్తగా చూసుకుంటూ ఎత్తుకి పై ఎత్తుల్ని వేస్తున్నాడు కరణం. వాళ్ళిద్దరికీ తెలుసు. ఈ ఆటలో అంతిమ విజయం పంతులుదేనని. ఓడిపోయానని మున్సబు ఆట మానేయడు. గెలిచానని పంతులు విర్రవీగడు. మున్సబుని చులకన చేయడు కూడా.

"అదేనయ్యా పంతులూ నీలో నేను మెచ్చుకునేది. అంతా డిపెన్సు ఆడేత్తావు. ఎటేకు ఇవ్వవు. అవతలోడికే ఆడి ఆడి అర్టు ఎటేకు ఒస్తాది" అన్నాడు మున్సబు ఆట సగంలో.

"నువ్వేమన్నా అను మున్సబూ! శత్రువు ఆగమేఘాల్లా మీదపడుతూంటే ఆత్మరక్షణ చేసుకోవడం ప్రతి ప్రాణికి జీవన లక్ష్యం. మరి ముందూ వెనకా చూసుకోకుండా మీద పడితే శత్రువు వెనకనుంచిపడే దెబ్బల్ని కాచుకోలేడు. అదే ఈ చదరంగంలో విశేషం" అని ఒక ఎత్తు వేసి, "తెరచీ, వేసీ రాజు, ఆట కట్టు" అన్నాడు పంతులు.

ఇంకా చాలసేపు సాగుతుందనుకున్న ఆట ఉన్నట్టుండి పంతులు కట్టేయడంతో అదోలా నవ్వుతూ మున్సబు అన్నాడు. "సర్లే! నీ ఆట నాకు తెలియంది కనకనా? ఇగ చాల్లే!" అని ఏదో గుర్తువచ్చినవాడిలా, "అవును పంతులూ! అది సరే గాని, మన యిద్దరి ఆట ఈ గవురుమెంటోడు ఇలా కట్టేయడం నాకేం నచ్చలేదయ్యా! నీ కెలాగుందో గాని, నాకు మాత్రం తల తీసేసినట్టుందయ్యా. నిన్నగాక మొన్న గోచీ పెట్టిన గుంటయెధవ మనమీద పెసిడెంటు గిరీ చేసి రాజ్జెం జెయ్యడవాఁ? సీ! సీ! తల్సుకున్నప్పుడల్లా నా వొల్లు సచ్చిపోతందనుకో" అన్నాడు.

"ఏం చేస్తాం మున్సబూ! మన రోజులు కానప్పుడు మనం మాట్లాడకూరుకోవడమే ఉత్తమం. 'అనువుగాని చోట అధికుల మనరాదు' అన్నారు అనుభవజ్ఞులు" అని జవాబిచ్చాడు కరణం.

"అదుగో, అదే నీకూ నాకూ తేడా మరి. నువ్వే యెండకా గొడుగు పట్టేత్తావు. నీ వొరలోంచి కత్తెప్పుడూ ముందు బైటికి రాదు. నీకేమైనా ఇంకా ఆశ వుందేమోగాని, ఆడు మళ్లీ మనకి వుజ్జోగాలిత్తాడనిపించడం లేదు" అన్నాడు నిరాశగా మున్సబు.

"ఆ ఆశ నాకూ లేదనుకో. అలాగని మనం సన్యాసం పుచ్చుక్కూచుంటామా, మన బతుకుదెరువులేవో మనకున్నాయిగా!" అన్నాడు ఆశాజీవి కరణం.

"పంతులూ నిన్నింతప్పట్నుంచి ఎరుగుదును గాని నీ కింత గుండె ధైర్యం ఎలా వొచ్చిందో తెలుసుకోలేకపోయానయ్యా. కొండ యిరిగి మీద పడతన్నాసరే చీమ కుట్టి నట్టయినా చలించవు నువ్వు. యాభై సంవత్సరాలు నీ దగ్గిర సావాసం చేసేనుగానీ పిసరంత నీ గుణం నా కబ్బింది కాదనుకో" అన్నాడు మున్సబు.

అవును మరి! అన్నలూ, అమ్మలూ రాజ్యాలకి రాకముందు, ఆంగ్లేయుల పాలనలో మనదేశం ఉన్నప్పుడే గ్రామాధికార్లుగా చేయీ చేయీ కలిపిన అవినాభావ సంబంధం వారిది.

ఆ రోజులు వేరు.

* * *

అప్పుడు గునుపూడిలో టెంపరరీగా ఉన్న కరణం ఓ 'నస్మరంతి' గాడవటంతో మున్సబుకి ఆ వూళ్లో ఆడింది ఆటగా, పాడింది పాటగా ఉండేది. అటువంటి పరిస్థితుల్లో ఏదో వంశపారంపర్యపు హక్కు మిషగా పెట్టుకుని పంతులు ఆ కరిణీకం కోసం ప్రయత్నించడం మున్సబు కేమాత్రం గిట్టలేదు. సాఫీగా సాగిపోతున్న తన అధికారానికి ఈ కొత్త కరణం వచ్చి ఎక్కడ ముప్పు తెచ్చిపెడతాడోనని వాపోయాడు.

మనం రైల్లో ప్రయాణం చేసేటప్పుడు స్టేషనులో బండి ఆగగానే కొత్తవాళ్ళు ఎక్కుతోంటే వీళ్ళంతా అనవసరంగా ఎక్కేస్తున్నారనిపిస్తుంది. అన్ని పెట్టెలుండగా వాళ్ళు మన పెట్టెలోనే ఎందుకు ఎక్కాలి అనిపించి, వాళ్ళకి ఎన్నో విధాల నచ్చచెప్పుతాం - ఇది రిజర్వేషను డబ్బా అనీ, ఇంకా ఆడవాళ్ళ పెట్టె అనీ చెప్పి తప్పించాలని చూస్తాం. ముందూ వెనకా పెట్టెల్లో చాలా ఖాళీగా ఉందని కూడా చెప్తాం. వినకపోతే వీలైనంతవరకూ తలుపు తీయకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాం. అసలు వీళ్ళందరి దగ్గరా టిక్కట్లున్నాయా అని అనుమాన పడతాం కూడా!

అన్ని ప్రయత్నాలూ మున్సబు కూడా చేశాడు పంతులుకా కరిణీకం రాకుండా చేయడానికి. ఇలా పంతులు ఉద్యోగానికి అర్జీ పెట్టుకున్నాడని తెలియగానే, 'సుముద్దారు' గారికి కోడిపెట్టా, వీశెడు పట్టుతేనే, విరుగుడు చేవ (రోజ్‌వుడ్) కుర్చీ ఒకటీ బహుమతిగా పంపించి, ఆ అబ్బాయికి కరణీకం రాకుండా చూడమని తలారిచేత కబురెట్టాడు. ఊళ్ళోకి వచ్చిన పంతుల్ని, ఇంటికి పిలిపించి, పెద్ద పెద్ద మోతుబరులున్న ఈ వూళ్ళో నీలాంటి వాళ్ళు నెగ్గుకురాలేరని భయపెట్టి మజ్జిగ దాహం ఇచ్చి పంపించాడు. పంతులు కిష్టమైతే పై అధికార్లకి చెప్పి 'పేట' కరిణీకం వేయిస్తానన్నాడు. నిజానికి నీ కరిణీకం వంశపారంపర్యం కాదని నచ్చజెప్పజూశాడు.

ప్లాటుఫారం మీదున్న వాడెప్పుడూ రైలు పెట్టెలో కూర్చున్నవాడికి లోకువే! 'బాబ్బాబూ! అర్జంటుగా వెళ్ళాలి. రైలెంతోసేపు ఆగదు. ఒక్కసారి తలుపు తీయండి బాబూ, ముందు స్టేషన్లో మరో పెట్టెలోకి మారిపోతాను. అదుగో గార్డు విజిలేసి, పచ్చజెండా ఊపేస్తున్నాడు. తలుపు తియ్యండి బాబూ' అని బతిమాలుకుంటాడు. ఎవరైనా జాలిపడి తలుపు తీశారా సరే లేకపోతే పక్కనున్న కిటికీ గుండా ముందు సామాను లోపలికి గిరవాటేసి, ఒక్క ఉదుటులో కాళ్ళు ముందేసి లోపలికి ప్రవేశిస్తాడు. ఈ జనసాగరంలోకి మరో మనిషి పుట్టుకొచ్చినట్టు.

పంతులికీ మున్సబు విషయం అర్థం అయింది. అది తనకి అనువుగాని చోటు, సమయం కూడా అని తెల్సుకున్నాడు. అందువల్ల అటునుంచి నరుక్కురాడానికే నిశ్చయించు కున్నాడు. చిన్నవాడైనా చురుకైనవాడు కాబట్టి పరిస్థితుల్ని అవగాహన చేసుకోగల్గాడు. "దానికే మీవంటి వారి సహాయ సహకారాలుంటే నా కార్యం సానుకూలం చేసుకోకపోతే జీవితం గడిచేదెలా? నా ప్రయత్నం నేను చేస్తాను. తరువాత భగవంతుడి దయ" అని చెప్పి వచ్చేశాడు.

ఆంగ్లేయుల పాలన కాలంలో అధర్మం ఒక పాలు తక్కువ ఉండడంవల్లనైతేనేమి, పంతులు జాతకంలో గురుడు ఉచ్చస్థితిలో ఉండడంవల్ల నైతేనేమి. రాత్రింబగళ్ళూ తాలూకాఫీసు చుట్టూ కాళ్ళరిగేలా తిరిగి పై అధికార్ల మెప్పు సంపాదించడంవల్ల నైతేనేమి మొత్తం మీద గునుపూడి కరణీకం పంతులుకయ్యింది. ఆ ఆర్డరు పట్టుకుని ప్లాటుఫారం మీంచి రైలు పెట్టెలోకి దూకిన ప్రయాణీకుడిలా గునుపూడిలో ప్రవేశించాడు పంతులు.

ఆ నిమిషం వరకూ అభ్యంతరం చెప్పినా, ఒకసారి ఎలాగో పెట్టెలో ప్రవేశించిన ప్రయాణీకుడు ప్రక్కనే కూర్చోగానే పరమ మిత్రుడౌతాడు. అందులోనూ టెక్కెట్టున్నవాడైతే

మరి చెప్పనక్కరలేదు. అవసరార్థం రెండు పక్కలవారూ సంధి జరుపుకుని, మాటామంతీలోకి దిగుతారు. అంతా చెయ్యీ చెయ్యీ కలిపి తర్వాతి స్టేషనులో మరెవ్వర్నీ ఎక్కనీయకుండా విశ్వప్రయత్నం చేస్తారు. ఎవరో ఒకరి గమ్యస్థానం రాగానే 'అయ్యో! అప్పుడే దిగిపోతారా?' అని ఆప్తుల్లా కళ్ళ నీళ్ళు పెట్టుకునేవాళ్ళు కూడా అరుదేం కాదు!

అలా ఆర్డరు పట్టుకొని ఊళ్ళో కొచ్చిన పంతులికి, మారుమాటాడకుండా ఛార్జీ అప్పజెప్పి పాత కరణం వాళ్ళూరు వెళ్ళిపోయాడు. కరణీకం అనగానే అంతో ఇంతో అధికారం చేతిలో ఉంటుంది కాబట్టి కొందరు వంధిమాగధులు వచ్చి చేరారు పంతులు దగ్గర. తన ప్రయత్నం ఫలించకుండా పంతులికుద్యోగం రావడం మున్సబు మనసుకి కాస్త యిది అనిపించినా తనకంటే తెలివైనవాడు మరొకడు ఈ వూళ్ళో వుండడం మంచిదే అని సంతోషించాడు.

తాడూ బొంగరం లేకుండా వచ్చిన కరణం పంతులు ఆ వూళ్ళో నెమ్మదిగా స్థిరపడ్డాడు. నలుగురు పెద్దమనుషుల సహాయంతో తనుండడానికో చిన్న నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. పెళ్ళి చేసుకుని కాపురం పెట్టాడు. ఆ మారాజు మంచోడని నలుగురి నోట్లోనూ తన పేరు నానేలా మసులుతున్నాడు. నాలుగు అక్షరం ముక్కలు చదువుకున్నవాళ్ళని ఓ దగ్గరచేర్చి 'శ్రీ కృష్ణ విలాస సంఘం' స్థాపించి వాళ్ళచేత, 'బుద్ధిమతీ విలాసం', 'చితోడు పతనం' లాంటి నాటకాలు వేయించాడు. బీదవాళ్ళకి ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు తెలియజెప్పి కొందరికి కొంప్ర చేసుకోడానికి భూము లిప్పించాడు. నిద్రాణమై ఉన్న ఆ ఊళ్ళో అలా కొంత చైతన్యానికి నాంది పలికాడు పంతులు. దాంతో అతని పేరు, ఉన్న వూళ్ళోనే కాకుండా పక్క వూళ్ళలో కూడా మారుమోగసాగింది. కొత్త కరణం వచ్చిందగ్గర్నుంచీ తనకీ నౌకరీలో చాలా సాయంగా ఉన్నప్పటికీ ఆయన కంత మరీ మంచి పేరొచ్చేయడం ఓ పక్కన బాధ కలిగిస్తూనే వుంది మున్సబుకి. అతనిలోని దానవుడు అప్పుడప్పుడూ పంతులుమీదో దెబ్బవేయడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు.

* * *

సంక్రాంతికి గునుపూడిలో జరిగే కోడి పందాలు ఆ తాలూకా అంతా పేరు మోసినవి. ఆ పందాలకి ప్రతి సంవత్సరం మున్సబే నాయకత్వం వహిస్తాడు. దానికి కారణం అతని దగ్గర మంచి జాతి కోడిపుంజులుండడమూనూ, అవి క్రమం తప్పకుండా పందాల్లో ప్రతియేటా మున్సబునే గెలిపించడమూనూ. ఎప్పుడూలాగే, ఆ సంవత్సరం కూడా సంక్రాంతికి కోడి పందాలు ప్రకటించాడు మున్సబు. పంతులు కూడా ఈ సంవత్సరం తన పుంజుతో పోటీకొస్తున్నాడని తెలిసి ఆశ్చర్యపోయి "పంతులు పెంచిన పుంజు పందెం కొడతాదేట్రా?" అని మీసం మెలేస్తూ అడిగాడు అబ్బిగాడ్ని మున్సబు. "మన పుంజుని గాని జూసిందంటే అది మూడు కోసుల దూరం పారిపోద్దండి దొరా!" అని జవాబిచ్చాడు అబ్బిగాడు. వాణ్ణి కేవలం పందెం పుంజుల్ని మేపడానికే పెట్టుకున్నాడు మున్సబు. అలా అనుకునే ధైర్యంగా ఉన్నాడు మున్సబు ఆ రోజువరకూ. కాని అన్ని పందేలూ గెలుస్తూ, ఆఖర్న తన 'డేగ'ను

కూడా ఓడించిన పంతులు పుంజుని చూసి క్రుద్ధుడయ్యాడు మున్సబు. ఓడిపోయిన కోపంతో నిప్పులు గక్కుతూ ఒక్కఉదుటున వచ్చి ఆ పుంజుని చేత్తో పట్టుకుని పరీక్షగా చూసి ఆశ్చర్యపోయాడు. అది అచ్చం తన దగ్గరున్న పుంజుల జాతికి చెందిందే. కాకపోతే ఇంకా బలంగా మేపబడింది. అందుకే తన పుంజుల్ని కొట్టగలిగింది. కానీ ఈ ప్రాంతాల్లో మరెవ్వరి దగ్గర ఇలాంటి కోళ్ళు లేవు. తానై పంతులెప్పుడూ తన దగ్గర కోడిని కొనలేదు. మరి ఈ పుంజు పంతులికెలా వచ్చింది? అవమానభారంతో సెగలు గక్కుతూన్న కళ్ళతో పంతులు దగ్గర కెళ్ళి అదే అడిగాడు.

"ఈ పుంజు నీకెక్కడిది?" అని.

పంతులు చిరునవ్వుతో తాపీగా ఆకాశం వైపు చూసి, "అక్కడి నుంచి వచ్చింది" అని సమాధానం చెప్పాడు.

దాంతో మున్సబు మరీ రెచ్చిపోయి, "ఏటా తల తిరుగుడు సమాధానం? తిన్నగా చెప్పు" అని అరిచాడు ఉగ్రరూపంతో.

"అవును బాబూ! ఓనాడు ఓ కోడిపిల్లని గెద్ద ఎత్తుకొచ్చి అయ్యగారి పెరట్లో కొబ్బరిచెట్టు మీద వాలి జారొదిలేసింది. దాన్ని తీసి పెంచి ఇంతచేసారు కర్నంబాబుగారు. పట్నం నుంచి పత్తేకం దీనికోసం పెస్సలు మేత తెప్పించీవోరు" - అని వెనకనున్న నూకరాజు వివరించి చెప్పాడు.

విషయం అర్థం చేసుకున్నాక ఏడవాలో నవ్వాలో అర్థంగాక, పంతులు తెలివికి మనసులోనే ఆశ్యర్యపోతూ పైకి మాత్రం గంభీరంగా "ఏడిశావు. నోరుముయ్యి" అని నూకరాజుని తిట్టి ఇంట్లో దూరాడు మున్సబు.

అప్పట్నుంచీ ఎలాగైనా పంతులికి బుద్ధిచెప్పాలని అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు మున్సబు.

✷ ✷ ✷

మరో మూడేళ్ళకి కాని మున్సబుకి ఎదురు చూసిన అవకాశం రాలేదు. ఆ రోజు 'దెయ్యాల గరువు' పెద్ద నాయుడు దగ్గర పంతులు కొంటున్నాడని తెలిసింది. అందుకే లోలోపల సంతోషించాడు. ఇదే నిజమయితే ఈ దెబ్బతో పంతులు పవరో నా పవరో తేలిపోవాలి అనుకున్నాడు. దెయ్యాల గరువుకి ఉత్తరం వైపు సరిహద్దుల్లో మున్సబుకి భూమి వుంది. అక్కడి రెండు పెద్ద జువ్విచెట్లు పెద్ద నాయుడి భూమిలో ఉన్నా వాటి శాఖలు మాత్రం బాగా మున్సబు భూమి వైపు వ్యాపించి ఉన్నాయి. ఆ శాఖలకి ప్రతి నిత్యం పెద్ద పెద్ద తేనెపట్టులు పట్టి ఉంటాయి. చెట్లెవ్వరివి అనే ప్రసక్తి లేకుండా తరతరాలుగా ఆ తెనెపట్టుల నుంచీ తెనె తీయించుకుని మున్సబు కుటుంబమే అనుభవిస్తోంది. దాని క్కారణం ఇటువైపువారి అధికారం, మోతుబరితనం; అటువైపువారి అసహాయత, మంచితనమూను.

దెయ్యాల గరువు కొనడానికి కరణంగారు అగ్రిమెంటు రాయించుకున్నారని తెలిసి శ్రేయోభిలాషులు కొందరు ఈ పాత గాథనంతా ఆయనకి చెప్పి ఆ భూమి కొనడం అంత మంచిది కాదేమోనని సలహా ఇచ్చారు. అసలు పెద్ద నాయుడంత చవగ్గా ఆ భూమి అమ్మేయడానికదొక కారణం అని కూడా చెప్పారు. పంతులు అంతా విని నవ్వి ఊరు కున్నాడు. తను కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొనుక్కున్న భూమిని స్వాధీన పరుచుకుని పంట వేసుకున్నాడు. కోసుకుని ఇంటికి తెచ్చి గాదె నింపుకున్నాడు. పంతులికి నెమ్మదిగా ఇంట్లో పిల్లా, పీచూ కలిగారు. పాడీ పంటా బయలుదేరాయి. హాయిగా తన పని తాను చూసుకుంటూ నొప్పించక తానొవ్వక అన్న సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని కాలాన్ని వెళ్లబుచ్చుతున్నాడు.

ఇలా వుండగా ఓ రోజున - పున్నం ముందు దశమినాడు - పంతులు పొలంలో పని చేసుకుంటూండగా మున్సబు పాలికాపులిద్దరొచ్చి, "దొరగోరు తేని తీసి ఒట్రమ్మన్నారండి" అన్నారు.

"వెళ్ళండ్రా వెళ్ళండి! 'భూమి నాది, చెట్లు నావి, తెనె నాది' అన్నానని చెప్పండ్రా మీ మున్సబుకి. ఊళ్ళో అందరికీ ఓ నీతీ, మీ దొరకో నీతినా?" అని వాళ్ళని పంపించేశాడు.

ఆ మర్నాడు మధ్యాహ్నం మర్రిచెట్టు కింద మున్సబు మహా రోషంతో చిందులు తొక్కాడు. పక్కనే ఉన్న పంతులికి వినిపించేలా బూతులు తిట్టాడు. "తేనె తియ్యనివ్వడట! ఎలా తియ్యనివ్వడో సూత్తాను ఆడి బాబుగోరి సొమ్మనుకుంటున్నాడేమో! మక్కెలిరగ దన్నించేత్తాను నాతోగానే పెట్టుకుంటే. ఏవనుకుంటున్నాడో!" అని అరిచి అరిచి ఆయాస పడ్డాడు. ఇంత జరిగినా కరణం పల్లెత్తు మాట అనకపోవడంతో కొంత నిరుత్సాహపడి, ఆరిపోయిన చుట్ట అంటించుకునే నెపంతో అక్కడి నుంచి జారుకున్నాడు.

ఆరోజు రాత్రి పంతులు భార్య కలగజేసుకుని అతన్ని వారించింది - "వాళ్ళతో మనకెందుకండీ!" అని.

"పిచ్చిదానా అలా భయపడితే ఎలా? మనం జీవితం అంతా వాళ్ళతోనే కలిసి గడపాలి. నీకేం భయం లేదు, నేను చూసుకుంటాలే!" అని ఆమెను సముదాయించాడు పంతులు.

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలన్నిది అతని మతం.

వచ్చే పౌర్ణమినాటి అర్ధరాత్రి, బలిష్టులైన పది మంది అనుచరుల్ని పంపి తేనె తీయించే ప్రయత్నం మున్సబు చేస్తున్నాడని పంతులి గూఢచార్లు వార్త తీసుకొచ్చారు. ఆ రోజుకి పంతులు ఊరెళ్ళాడని తెలిసి, పేచీకి భయపడి పంతులు ఊరొదిలి పారిపోయాడని సమాధానం చెప్పుకుని మురిసిపోయాడు మున్సబు.

అర్ధరాత్రి తేనె తేవడం కోసం వెళ్ళిన అనుచరులు ఒకడు వేళ్ళు నరుక్కుపోయి, మరొకడు కన్ను లొట్టపోయి ఇలా అందరూ లబోదిబోమంటూ తిరిగి పరుగెత్తుకొచ్చారు మున్సబు ఇంటికి.

"ఏమయిందిరా? తేనేదీ?" అని అడిగిన మున్సబుకి, "అయ్యబాబోయ్! అక్కడ ఫుల్‌గా కల్లు తాగేసి మనుషుల రక్తం తాగడానికి కూడా జంకని యములాళ్లలాటి కొండోళ్ళు అయిదుగురున్నారు బాబూ! ఆ తేనె తేవడం మా తరంగాదు బాబూ" అని చెప్పి తోకలు ముడిచి ఇళ్ళకి పోయారు.

'అమ్మ పంతులూ నువ్వెంత గుండెలు తీసిన బంటువయ్యా?' అని గుండెలు బాదుకున్నాడు మున్సబు.

ఆ తర్వాత ఈ తగువుకి శాశ్వతంగా స్వస్తిచెప్పాలని పంతులు పొలంలో చెట్లు రెండూ కొట్టించేసి కలపని. తన మేడ కట్టించడానికి పెట్టిన 'ఇటిక ఆవం' కాల్చడానికి వాడేసుకున్నాడు.

ఇది జరిగిన కొన్నాళ్ళకి మున్సబూ, కరణం ఏమీ జరగనట్టే ఏకమైపోయారు. కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. గునుపూడిలో మర్రిచెట్టు ఎంతో చరిత్రని చూసింది. ఇంగ్లీషు వాళ్ళని తరిమేసి ఇండియా 'భారత్' అయింది. పంతులు కట్టిన మేడ కెదురుగా దానికి డబుల్‌గా మున్సబు ఇంకో మేడ కట్టాడు. అటూ ఇటూ పిల్లలూ, పెళ్ళిళ్ళూ పేరంటాలూ చేశారు. ఆ వూరి పరిపాలన వారి చేతుల మీదుగా నడుస్తూనే వుంది. ఈ జీవిత చదరంగంలో ఎత్తుపై ఎత్తులు వారిద్దరూ వేస్తూనే ఉన్నారు. ఇందులో గెలుపు ఓటమి ఎవరివన్న విషయం ముఖ్యం కాదు. దీనికి గమ్యం ఏమిటంటే ఏమీ లేదు. ఇదీ ఒక జీవన విధానం, అంతే! అదీ! మొన్న మొన్నటీ వరకూ - అమ్మలూ, అన్నలూ పరిపాలనలోకి వచ్చిన వరకూ -

ఇప్పుడూ ఉండలేక వారా చదరంగం అలా ఆడుతూనే ఉన్నారు. ✶